# జర్నలిస్ట్ డైలీ
తెలుగు దినపత్రిక

SV6 NEWS
సమగ్ర సమాచార వారధి

సంపుటి :12 సంచిక :297 గురువారం 25-6-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


# ఎమ్మెల్యేలకు సీఎం డెడ్‌లైన్

## 'వారంలోగా పనితీరు మారాలి

- లేదంటే మీ స్థానంలో మరొకరిని నియమిస్తాం
- పార్టీ కోసం పనిచేయకపోతే మాకు అవసరం లేదు
- ఎంత పెద్దవారైనా వదలం
- ఇన్‌చార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలి'
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జూమ్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పనితీరు మార్చుకునేందుకు 10 రోజుల గడువు విధిస్తున్నానని, తీరు మారని పక్షంలో వారి స్థానంలో యాక్టివ్‌గా ఉన్న నాయకులకు బాధ్యతలు అప్పగిస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మంత్రులైనా సరే బాధ్యతగా పనిచేయకపోతే ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పిస్తామని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో లౌకికవాద ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటును కాపాడుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



2



## బీఆర్ఎస్ నేతల మాటలు
# నమ్మితే అధోగతే

- ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు
- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల

**ఖమ్మం జూన్ 24 జర్నలిస్టు డైరీ**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు.

-మిగతా 2 లో



## చంద్రబాబు జేబు సంస్థగా
# పోలీస్ వ్యవస్థ

- సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు
- పోలీసుల తీరుకు నిరసనగా వచ్చేనెల 29న పాదయాత్ర
- మీడియా సమావేశంలో అంబటి రాంబాబు

**గుంటూరు,జూన్ 24 జర్నలిస్టు డైరీ**

ఏపీలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. సాయికృష్ణ కేసులో సాక్ష్యాలను మాయం చేశారు. ఏ తప్పు చేయకపోయినా తనను అరెస్ట్ చేశారంటూ మండిపడ్డారు. 18 రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉంచారు. వచ్చే నెల 29న వినతి పాదయాత్ర చేస్తా అని అంబటి ప్రకటించారు. అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ..'కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒత్తిడితోనే నాపై కేసులు నమోదు చేశారు. నా ఇంటిపై దాడి చేయడమే కాకుండా నాపై అక్రమంగా రెండు కేసులు పెట్టారు.


-మిగతా 2 లో

# ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?



- బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం
- నేరుగా సుప్రీంకు వద్దు.. ముందుగా హైకోర్టుకే వెళ్లండి
- ఆర్టికల్ 32 కింద దాఖలైన పిటిషన్ ఉపసంహరణ
- కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ

2



# ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోదీకి ఆహ్వానం

- వచ్చే నెల 5 నుంచి 9 వరకు ఇరాన్‌లో అధికారిక కార్యక్రమాలు
- టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో అంతిమ సంస్కారాలు.. మషాద్‌లో ఖననం
- హాజరుపై ఇంకా నిర్ణయం తీసుకోని భారత ప్రభుత్వం
- చాబహార్, ప్రాంతీయ భద్రతపై భారత్-ఇరాన్ కీలక చర్చలు

**న్యూఢిల్లీ,జూన్ 24 జర్నలిస్టు డైరీ**

:ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు ఘనంగా జరగబోతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్

-మిగతా 2 లో



# రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

- కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం
- జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం
- సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**ఖమ్మం, జూన్ 24 జర్నలిస్టు డైరీ**

రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు.

-మిగతా 2 లో

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు
# అన్యాయం


### కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి

- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి
- నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది
- కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, జూన్ 24 జర్నలిస్టు డైరీ**

తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన

-మిగతా 2 లో



# ఫ్రాన్స్, బ్రిటన్‌లో.. ఉక్కిరిబిక్కిరి



- ఎండ వేడిమితో ఈతకు వెళ్లి 40 మంది మృతి
- నిప్పుల కొలిమిలా యూరప్
- సగం ఫ్రాన్స్‌కు రెడ్ అలర్ట్
- నిద్ర లేచేసరికే ఒళ్లంతా చెమటలు
- గాల్లో నిప్పులు కురుస్తున్నట్లు అనుభూతి

2

# రాజకీయాల్లోకి వస్తే టార్గెట్ చేస్తారా?



- సమాజంలో కులాల కంటే.. మగ, ఆడ అనే రెండు కులాలే ఉన్నాయి!
- పోలీసు శాఖలో 33 శాతం రిజర్వేషన్లు.. ఇంకా పూర్తిస్థాయిలో అమలేదీ?
- ఐటీ, బ్యాంకింగ్ రంగాల్లో రాణిస్తున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతలతో మళ్లీ మొదటికే!
- 2026లోనూ బాల్య వివాహాలా?..
- టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆవేదన

**హైదరాబాద్, జూన్ 24 జర్నలిస్టు డైరీ**

రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి

-మిగతా 2 లో

# ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది



- రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది
- జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి
- భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది
- శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం
- గొడ్డలి పార్టీ కుల రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి
- జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

**కర్నూలు జూన్ 24 జర్నలిస్టు డైరీ**

ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాలసీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు. గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి అన్నారు.

-మిగతా 2 లో

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక
గురువారం 25 జూన్ 2026

## బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే

మొదటి తరువాయి

కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## చంద్రబాబు జేబు సంస్థగా పోలీస్ వ్యవస్థ

మొదటి తరువాయి

నన్ను జైలులో ఉంచారు. రెండు కేసుల్లో ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లే పెట్టారు. ఈ కేసులో ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐకి హైకోర్టు.. కోర్టు ధిక్కరణ కింద నోటీసులు ఇచ్చింది. వంశీధర్ అనే సీఐ, మధు అనే ఎస్ఐ ఇల్లీగల్గా నన్ను లోపలేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఈ ముగ్గురు పోలీసులను కేంద్ర మంత్రి పెమ్మసాని పురిగొల్పి నన్ను అరెస్ట్ చేయించారు. డీజీపీ, ఐజీ, ఎస్పీ, డీఎస్పీలకు చెబుతున్నాను. నా ఇంటిపై దాడి చేసిన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. అందుకే వచ్చే నెల 29వ తేదీన వినతి పాదయాత్ర చేస్తున్నాను. పోలీస్ వ్యవస్థ చంద్రబాబు జేబు సంస్థగా కొనసాగుతుంది. సాయికృష్ణ అంశంపై మేము పోరాడటానికి కారణం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఏడాది సీసీటీవీ ఫుటేజ్ మాయం చేశారు. ఏడాది నుండి పీఎస్లో నేరాలు జరుగుతున్నాయి. ఐజీ రవి ప్రకాష్ ఆధ్వర్యంలోనే సాక్ష్యాధారాలు మాయం చేశారు. సీఐ నాగరాజుతో బేరసారాలాడారు. ఏ పోలీసు పేరు చెప్పవద్దని సీఐ నాగరాజును బతిమలాడారు. ఏ తప్పు చేయకపోయినా నన్ను అరెస్ట్ చేసి జైలులో వేశారు. కానీ, సీఐ నాగరాజుని లాకప్లో ఎందుకు వేయలేదు?. పోలీసులు ప్రజలను కాపాడలేరు. సీఎం, హోంమంత్రి విఫలమయ్యారు. పవన్ కళ్యాణ్.. నాగరాజును జిందాబాద్ అంటారేంటి ఆయనకు సిగ్గు అనిపించడం లేదా?. పవన్ కల్యాణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలి. హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?

- బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం
- నేరుగా సుప్రీంకు వద్దు.. ముందుగా హైకోర్టుకే వెళ్లండి
- ఆర్టికల్ 32 కింద దాఖలైన పిటిషన్ ఉపసంహరణ
- కోల్కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్కు స్వేచ్ఛ

న్యూఢిల్లీ,



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి పేరు తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది.
ఎస్ఐఆర్లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.దాంతో పిటిషనర్ తరపు న్యాయవాది ఎస్ ప్రసన్న తన పిటిషన్ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది.

## ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోదీకి ఆహ్వానం

మొదటి తరువాయి

ఆహ్వానించారు. జులై 5 నుంచి 9వ తేదీ వరకు ఖమేనీ అంత్యక్రియలను ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మొదట టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం ఖమేనీ స్వస్థలమైన మషాద్లో ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నాయకులను, ప్రతినిధి బృందాలను ఇరాన్ ఆహ్వానిస్తోంది. కాగా, ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ప్రధాని మోదీ స్వయంగా హాజరవుతారా లేదా భారత తరఫున ప్రత్యేక ప్రతినిధిని పంపుతారా అనే అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారత్-ఇరాన్ మధ్య ఇంధనం, వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, చాబహార్ నౌకాశ్రయం వంటి కీలక అంశాల్లో సహకారం కొనసాగుతోంది.

## రాజకీయాల్లోకి వస్తే టార్గెట్ చేస్తారా?

మొదటి తరువాయి

కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్లో జరిగిన వేట విమెన్ ఎంపవర్మెంట్ సమ్మిట్లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్మెంట్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లళైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు పిలుపునిస్తూ.. సోషల్ మీడియాలో లైకులు, ఫాలోవర్స్ రాలేదని నిరుత్సాహపడొద్దని, మహిళలంతా ఒక మంచి టా÷-గ్గ్÷ట్ పెట్టుకొని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యేలకు సీఎం డెడ్లైన్

- -వారంలోగా పనితీరు మారాలి
- -లేదంటే మీ స్థానంలో మరొకరిని నియమిస్తాం
- -పార్టీ కోసం పనిచేయకపోతే మాకు అవసరం లేదు
- -ఎంత పెద్దవారైనా వదలం
- -ఇన్చార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలి'
- -సర్తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- -బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- -జూమ్ మీటింగ్లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక



హైదరాబాద్,

ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్పై సర్పంచ్లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్గా ఉన్న మరోవ్యక్తిని ఇన్ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.
పశ్చిమ బెంగాల్లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్లో వీక్గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్ఛార్జిలు పాల్గొన్నారు.

# రేవంత్రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

మొదటి తరువాయి

బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాలిటీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు. ఒకటి రెండు కాదు దాదాపు 10వేల కోట్ల రూపాయలతో ప్రారంభమైంది సీతారామ ప్రాజెక్టు. అందులో 8 వేల కోట్ల రూపాయలు కేసీఆర్ ప్రభుత్వమే ఖర్చు పెట్టింది. అంటే 80 శాతం నిధులు మనం ఇప్పటికే ఖర్చు పెట్టాం. మరి ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లా మొత్తం కాంగ్రెస్కే గెలుపు అందించిన తర్వాత వాళ్లు మనకేం ఇచ్చారు.. ఇవాళ ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేయాలి. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి.. ముగ్గురు మంత్రులున్నారు. పవర్ఫుల్ పోర్ట్ఫోలియోల్లో ఉన్నారు.. పవర్ అంతా ఖమ్మం జిల్లాలోనే ఉందట. కానీ ఖమ్మం జిల్లా ప్రజలకు ఏం ఒరిగింది. ఖమ్మం జిల్లా రైతులకు ఏం జరిగింది.. దయచేసి మీరు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది

మొదటి తరువాయి

చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్లో ఉపాధి దొరుకుతుంది. జొన్నగిరి రాష్ట్రానికి ఆదర్శంగా తయారవుతుంది. ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజిన్గా మారుతుంది. ఇక్కడ నగల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్కు ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారింది. రాయలసీమకు ఇన్ని పరిశ్రమలు వస్తాయని అనుకున్నారా?దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సిటీ కర్నూలులో వస్తోంది. వీలైనంత త్వరగా కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. 2028 నాటికి రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ప్రారంభిస్తాం అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. వేంకటేశ్వరస్వామికి అపచారం జరిగితే శిక్షించాలా..లేదా? స్వామివారి ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారు. ఇప్పుడు దేవుడి దగ్గరకు వెళ్లి దండాలు పెడుతున్నారు. దేవుడిని నమ్మే ఏ వ్యక్తి కూడా వాళ్లను క్షమించడు. ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలనేదే నా ఆలోచన. గొడ్డలి పార్టీ విషాన్ని చిమ్ముతోంది. నేరాలు చేయడంలో ఆ పార్టీ నేతలు సమర్థులు. సాయికృష్ణ ఘటనకు కూడా కులం రంగు పులిమారు. డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్పై నోరుపారేసుకుంటున్నారు. అలాంటి వారి నోరు మూయించే శక్తి మాకుంది. మెగా డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత పేపర్ లీకైందని ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై చర్చకు రమ్మని మంత్రి లోకేశ్ సవాల్ విసిరితే రాలేదు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా దాదాపు 11వేల మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్కు తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం' అని చంద్రబాబు అన్నారు.

## ఫ్రాన్స్, బ్రిటన్లో.. ఉక్కిరిబిక్కిరి

లండన్,

ఫ్రాన్స్, బ్రిటన్ దేశాల్లో ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కదలకంటూ కూర్చున్నా ప్రాణాలు పోయేలా ఎండలు మండిపోతున్నాయి. వేడి తట్టుకోలేక ఉపశమనం కోసం ఈతకు వెళ్లిన వారిలో ఐదు రోజుల్లోనే ఏకంగా 40 మంది నీట మునిగి మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఖండంలో మెజారిటీ జనాభా ప్రస్తుతం మునుపెన్నడూ చూడని అత్యంత అసాధారణ ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

**ఫ్రాన్స్లో రెడ్ అలర్ట్**


ఫ్రాన్స్ జాతీయ వాతావరణ సంస్థ 'మెటియో ఫ్రాన్స్' దేశంలోని దాదాపు సగానికి పైగా ప్రాంతాలను అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ హీట్ వేవ్ అలర్ట్' పరిధిలోకి తెచ్చింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.

**మృతుల్లో యువకులే అధికం**

ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను సంక్షోభ సమీక్షా సమావేశం అనంతరం మాట్లాడుతూ.. గత ఐదు రోజులలో నీట మునిగి చనిపోయిన 40 మందిలో అత్యధికులు యువకులేనని తెలిపారు. ఫ్రాన్స్లో ఇళ్లు, ప్రజా రవాణా వ్యవస్థలకు ఎయిర్ కండిషనింగ్ సదుపాయం పెద్దగా లేకపోవడంతో స్కూళ్లు, రైళ్ల రాకపోకలు, క్రీడా ఈవెంట్లపై ఈ ఎండల ప్రభావం పడింది. మానవ తప్పిదాల వల్లే వాతావరణంలో ఈ మార్పులు వస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో వాతావరణ రికార్డులు మరిన్ని బద్దలవుతాయని ఐక్యరాజ్యసమితి వాతావరణ విభాగం హెచ్చరించింది.

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

మొదటి తరువాయి



అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్కు కర్ణాటక ఎన్వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది.

## పాకిస్థాన్ గగనక్షేత్రంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం



**న్యూఢిల్లీ: జూన్ 24 జర్నలిస్టు డైరీ**
ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ-321 ఢిల్లీ- అమృత్‌సర్ విమానం.. పాకిస్థాన్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది.సోమవారం రాత్రి 9.18 నిమిషాలకు ఢిల్లీ నుంచి ఆ విమానం టేకాఫ్ తీసుకున్నది. అయితే అమృత్‌సర్‌లో 10.30 నిమిషాలకు ఆ విమానం ల్యాండ్ కావాలి. కానీ అనుకోకుండా ఆ విమానం పాక్ ఎయిర్‌స్పేస్‌లోకి ఎంటరైంది. ఆ సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు శ్రీ గురు రామ్ దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మేనేజింగ్ అధికారి తెలిపారు. స్థానిక ఎయిర్ పోర్టు కంట్రోల్ రూమ్ ఆదేశాలతో ఆ విమానం ఢిల్లీకి తిరిగి వచ్చేసింది. మళ్లీ రెండు గంటల వ్యవధి తర్వాత టేకాఫ్ తీసుకుని ఆ రోజు రాత్రి 2.20 నిమిషాలకు అమృత్‌సర్ చేరుకున్నది. పాకిస్థాన్ ఎయిర్‌స్పేస్‌లో కనీసం రెండు కిలోమీటర్ల దూరం కూడా ఆ విమానం వెళ్లలేదని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ భూపేందర్ సింగ్ తెలిపారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో విరిగిపడ్డ కొండచరియలు



**హైదరాబాద్ జూన్ 24 జర్నలిస్టు డైరీ**
అరుణాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బుధవారం నాటికి తీవ్ర రూపం దాల్చాయి. కేయీ పన్యోర్ జిల్లాలో వరద ఉధృతికి ఇళ్లు దెబ్బతినడమే కాకుండా, ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. యాజాలి పరిధిలోని పూసా సమీపంలో గల నీప్కో ప్రాజెక్ట్ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ఒక రిటైనింగ్ వాల్ కుప్పకూలడంతో వరద నీరు నివాస ప్రాంతాల్లోకి దూసుకెళ్లింది. కనీసం 18 ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపింది.

## ఏఐలోనూ జాతి వివక్ష



**న్యూఢిల్లీ, జూన్ 24 జర్నలిస్టు డైరీ**
కృత్రిమ మేధ (ఏఐ) మానవుల కన్నా తెలివైనదన్న మాటను వింటున్నాం. ఎలాన్ మస్క్ ఇప్పటికే ఏఐ ఆ స్థాయికి చేరుకుందని అంటున్నారు. కానీ మానవాళి తెలివితేటలు, మేధస్సుతో పాటు అతని నుంచి అత్యంత నీచమైన కొన్ని పక్షపాతాలను ఏఐ వారసత్వంగా పొంది ఉండవచ్చని ఐక్యరాజ్య సమితి జరిపిన ఒక పరిశోధన హెచ్చరిస్తున్నది.కొంతమంది పరిశోధకులు 133 ఏఐ వ్యవస్థలను అధ్యయనం చేయగా, వాటిలో దాదాపు సగం (44 శాతం) లింగ పక్షపాతాన్ని ప్రదర్శించాయి. పెద్ద భాషా నమూనాలు (ఎల్‌ఎల్‌ఏంలు) మహిళలను పదేపదే ఇంటికి, పిల్లల సంరక్షణకే ముడిపెట్టగా, పురుషుల విషయానికి వచ్చినప్పుడు వ్యాపారం, నాయకత్వం లాంటి అంశాల గురించే ప్రస్తావించింది. కొన్ని ఏఐ వ్యవస్థలు మహిళలను లైంగిక వస్తువులుగా, పురుషుల ఆధీనంలోని వ్యక్తులుగా చిత్రీకరించేలా స్పందనలను రూపొందించాయి.

## నింగిలోకి 10 లక్షల ఏఐ ఉపగ్రహాలు



**న్యూఢిల్లీ జూన్ 24 జర్నలిస్టు డైరీ**
ఉపగ్రహ రంగంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలనానికి తెరతీయనున్నారు. ఏఐ ఉపగ్రహాల సముదాయాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్టు ఆయన తెలిపారు. తమ సంస్థ స్పేస్ ఎక్స్ ప్రతిపాదించిన ఏఐ ఉపగ్రహాల సముదాయానికి స్టార్‌మైండ్ అని పేరు పెట్టనున్నట్టు మస్క్ ధ్రువీకరించారు. ఏఐ ఆధారిత కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను కక్ష్యలో ప్రవేశపెట్టడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ నెట్‌వర్క్‌లో 10 లక్షల వరకు ఉపగ్రహాలు ఉండచ్చునని నివేదికలు సూచిస్తున్నాయి. స్పేస్ ఎక్స్‌కు స్టార్‌లింక్ శాటిలైట్ నెట్‌వర్క్‌కు, స్టార్‌మైండ్‌కు చాలా తేడా ఉంది. రెండు ప్రాజెక్టులు కూడా అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహాల మీదే ఆధారపడినప్పటికీ రెండింటి లక్ష్యం ఒకటి కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ అనుసంధానతను కల్పించడానికి స్టార్‌లింక్‌ను ఏర్పాటు చేశారు.

# ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజులు తగ్గించలేం..

### భరించలేకపోతే స్కాలర్‌షిప్ పొందాలి: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, జూన్ 24 జర్నలిస్టు డైరీ**
ప్రైవేట్ వైద్య కళాశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను ఈడబ్ల్యూఎస్ అర్హత కోసం నిర్ణయించిన రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితిని ఎలా సమన్వయం చేసుకోవచ్చని ప్రశ్నిస్తూ ఆర్థికంగా బలహీన వర్గాలకు(ఈడబ్ల్యూస్) చెందిన ఒక అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. రాష్ట్ర రెగ్యులేటరీ కమిటీ ఖరారుచేసిన ఫీజుల విధానం చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని గుర్తిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది.ప్రభుత్వ కళాశాలలతో సమానంగా ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు ఉంటాయని ఆశించరాదని విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న అన్నారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ క్యాపిటేషన్ ఫీజు రద్దయింది కాబట్టి సాధారణ కాలేజీ ఫీజులు కూడా తీసుకోరాదంటే ఎలా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఒకవేళ మీరు చెల్లించలేకపోతే ఉపకారవేతనం లేదా ఆర్థిక సహాయం పొం దండి అని పిటిషనర్ సూచించారు.


# రిజర్వేషన్‌ను అంతం చేయడమే బీజేపీ రియల్ టార్గెట్



**న్యూఢిల్లీ: జూన్ 24 జర్నలిస్టు డైరీ**
లోక్‌సభలో మూడవ వంతు మెజారిటీ కోసం బీజేపీ ప్రయత్నిస్తుందని, దాంతో రిజర్వేషన్లను అంతం చేయాలని ఆ పార్టీ చూస్తున్నట్లు కాంగ్రెస్ నేత జయరాం రమేశ్ ఆరోపించారు. మూడో వంతు మెజారిటీ రాగానే రాజ్యాంగ సవరణ చేపట్టి రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిగా ఎత్తివేయాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ తొలుత మహిళా రిజర్వేషన్ బిల్లు నెపంతో డీలిమిటేషన్ బిల్లును తెచ్చిందని, దాని ముఖ్య ఉద్దేశం రిజర్వేషన్‌ను అంతం చేయడమే అవుతుందన్నారు. ఒకవేళ మహిళ రిజర్వేషన్ పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే, అప్పుడు నారీ శక్తి వందన్ అభియాన్ బిల్లును ప్రస్తుత లోక్‌సభ సామర్థ్యంతో అమలు చేయాలని జయరాం రమేశ్ డిమాండ్ చేశారు.టీఎంసీ, శివసేన యూబీటీ చీలకలో కేంద్ర మంత్రి అమిత్ షా జోక్యం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. బీజేపీకి 400 సీట్ల రావాలన్న కాంక్ష ఉందని, దాని కోసం రాజ్యాంగాన్ని సవరణ చేసి, రిజర్వేషన్‌ను అంతం చేయాలని చూస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేత తెలిపారు. ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లులు పాస్ కాకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. బుల్డోజ్ చేసైనా డీలిమిటేషన్ బిల్లును ఆమోదించాలని మంత్రి షా ప్రయత్నించారని, కానీ ఆయన విఫలమైనట్లు రమేశ్ తెలిపారు. ఆ రోజు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలని షా విభిన్న రాజనీతికి పాల్పడుతున్నట్లు తెలిపారు. లోక్‌సభలో మూడో వంతు మెజారిటీ కోసం టీఎంసీ, శివసేనలో చీలిక తెచ్చారన్నారు.

# రాబందుల సంరక్షణకు కీలక అధ్యయనం..

### 3334 కిలోమీటర్లు ప్రయాణించిన పక్షి



**న్యూఢిల్లీ: జూన్ 24 జర్నలిస్టు డైరీ**
భారతీయ శాస్త్రవేత్తలు రాబందుల పై చేపట్టిన అధ్యయనంలో అనేక విషయాలు వెల్లడయ్యాయి. పంజరంలో పెరిగిన పక్షులు కూడా .. వన్య వాతావరణాన్ని తట్టుకోగలవని నిరూపితమైనట్లు బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ డైరెక్టర్ కిషోర్ రిథే తెలిపారు. తాము విడిచిపెట్టిన ఓ రాబందు పక్షి సుమారు 3334 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు చెప్పారు. నిర్బంధ శిక్షణలో పెరిగిన రాబందులను .. మహారాష్ట్రలోని మేల్‌ఘాట్ నుంచి జనవరిలో వదిలేశారు. అయితే ఆ పక్షులు ఇటీవల రాజస్థాన్‌లోని రణ్‌తంబోర్ టైగర్ రిజర్వ్‌కు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఆ రాబందులు సుమారు 3వేల కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించినట్లు కిషోర్ తెలిపారు. రాబందుల సంరక్షణ ప్రోగ్రామ్‌లో కీలక మైలురాయి అందుకున్నట్లు ఆయన వెల్లడించారు. దీని ద్వారా దేశంలో రాబందుల సంఖ్యను పెంచవచ్చు అని తెలిసిందన్నారు. రాబందులు తమ ప్రయాణంలో భాగంగా సత్పురా టైగర్ రిజర్వ్, మధ్యప్రదేశ్‌లోని కూనో రిజర్వ్ ఫారెస్ట్‌లో కూడా సంచరించినట్లు తెలిసింది. చివరకు అవి రణ్‌తంబోర్ టైగర్ రిజర్వ్‌కు చేరుకున్నాయి. ఎక్స్67 అనే అయిదేళ్ల ఆడ రాబందు పక్షికి సోలార్ పవర్ ట్రాకింగ్ ట్యాగ్‌ను తొడిగి జనవరి రెండో తేదీన వదిలేశారు. మేల్‌ఘాట్ టైగర్ రిజర్వ్‌లోని అకోట్ వైల్డ్‌లైఫ్ డివిజన్‌లో ఉన్న సోమ్‌థాన రేంజ్ నుంచి దాన్ని విడిచిపెట్టారు. ఆహారం కోసం అది మూడు రాష్ట్రాల్లో తిరిగినట్లు గుర్తించారు. అయితే తొలి నాలుగు నెలలు మేల్‌ఘాట్‌లో ఉన్న ఆ పక్షి ఆ తర్వాత.. సెంట్రల్ ఇండియా దిశగా వెళ్లింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో సంచరించింది. ఆ వల్చర్ పక్షి 3334 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు బీఎన్‌హెచ్‌ఎస్ తన ప్రకటనలో చెప్పింది. భూపాల్ ప్రాంతంలో సత్పురా నేషనల్ పార్క్, కూనో నేషనల్ పార్క్ ప్రాంతంలో సుమారు 27 రోజుల పాటు ఆ పక్షి సంచరించింది. అయితే ఆ పక్షి ప్రయాణించిన మార్గాలన్నీ.. టైగర్ రిజర్వ్ ప్రాంతాలని కిశోర్ రిథే తెలిపారు. బ్లూ కలర్‌లో ఉన్న ట్యాగ్‌లను 15 రాబందులకు తొడిగి వాటిని రిలీజ్ చేశారు. సోలార్ పవర్‌తో నడిచే ట్యాగ్స్ వల్ల ఆ పక్షుల ఎటు వెళ్తున్నాయో శాస్త్రవేత్తలు ట్రాక్ చేస్తారు

# అమెరికాను వెనక్కి నెట్టేసిన చైనీస్ సూపర్ కంప్యూటర్..


### -ర్యాంకుల్లో లైన్‌షైన్ టాప్




**న్యూఢిల్లీ: జూన్ 24 జర్నలిస్టు డైరీ**
చైనా సూపర్ కంప్యూటర్ లైన్‌షైన్ తొలి ర్యాంక్ కొట్టేసింది. దీంతో శక్తివంతమైన కంప్యూటర్లలో అమెరికా వెనుకబడింది. 2017 తర్వాత తొలిసారి చైనా కంప్యూటర్లు టాప్ లిస్టులో ఉన్నాయి. షెన్‌జెన్‌లో ఉన్న లైన్‌షైన్ కంప్యూటర్.. సూపర్‌పవర్ రేసులో అమెరికాకు చెందిన ఎల్ క్యాప్టన్‌ను దాటేసింది. టాప్500 ర్యాంకులను మంగళవారం రిలీజ్ చేశారు. అయితే చైనీస్ కంప్యూటర్ తొలిసారి ఆ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చింది. టాప్500 ప్రాజెక్టు సైంటిస్టులు ప్రకారం లైన్‌షైన్ కంప్యూటర్ 2.198 ఎక్సాఫ్లాప్స్ అందుకున్నట్లు తెలిపారు. అంటే ఒక సెకనుకు 2 క్విన్‌టిలియన్ క్యాలికులేషన్స్ ఆ కంప్యూటర్ చేసినట్లు చెప్పారు.చైనాలో జియాంగ్‌షూ ప్రావిన్సులోని నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ సెంటర్‌లో లైన్‌షైన్ కంప్యూటర్ ఉన్నది. ఇక అమెరికాకు చెందిన కాలిఫోర్నియాలోని లారెన్స్ లివర్‌మోర్ నేషనల్ ల్యాబరేటరీలో ఎల్ క్యాప్టన్ కంప్యూటర్ ఉన్నది. ప్రస్తుతం ఎల్ క్యాప్టన్ కంప్యూటర్ రెండో ర్యాంక్‌లో ఉన్నది. అయితే అమెరికాలోని టెన్నిసెసి, ఇలియాస్‌ల్లో ఉన్న కంప్యూటర్లు తర్వాత ర్యాంకుల్లో ఉన్నాయి. ఇక జర్మనీకి చెందిన జ్యూపిటర్ కంప్యూటర్ అయిదో ర్యాంక్‌లో ఉన్నది. ఈ అయిదు సూపర్ కంప్యూటర్లకు మాత్రం వెరిఫికేషన్ సర్టిఫికేట్ ఉన్నది. లైన్‌షైన్ కంప్యూటర్ మిగితా వాటికి భిన్నంగా ఉన్నది. సంప్రదాయ కంప్యూటర్ చిప్స్, సీపీయూలపై ఈ కంప్యూటర్ నడుస్తుంది. గ్రాఫిక్స్ ప్రాసెసర్లను వాడడం లేదు. 42.2 మెగావాట్ల విద్యుత్తుతో దీన్ని ఆపరేట్ చేస్తున్నారు. ఇటలీ, స్విట్జర్లాండ్, జపాన్‌కు చెందిన సూపర్ కంప్యూటర్లు టాప్ టెన్‌లో ఉన్నాయి.

# క్యాన్సర్ గుర్తింపునకు పావురాల సాయం

**న్యూయార్క్ జూన్ 24 జర్నలిస్టు డైరీ**
క్యాన్సర్ కణాలను గుర్తించేందుకు ఏఐ టూల్స్‌కు పావురాలు సాయం చేస్తున్నాయి. హోలీ క్రాస్ కాలేజీ డాక్టర్ గ్రెజోరీ డిజిరోమాలో తన టీమ్‌తో కలిసి అధ్యయనాన్ని ప్రారంభించారు. ఈ సీటీ స్కాన్‌లో చిన్న కణతులను గుర్తించేందుకు ఏఐకి పావురాలతో ట్రైనింగ్ ఇప్పించేలా ప్రాజెక్టును డెవలప్ చేస్తున్నారు. దీంతో అవి నార్మల్ స్కాన్‌లు, కణతులు ఉన్న స్కాన్‌లను గుర్తిస్తున్నాయని డిజిరోమాలో తెలిపారు. ఈ పావురాల కంటిచూపు సామర్థ్యాన్ని అర్థం చేసుకుని.. దాన్ని ఏఐ టూల్స్‌కు ఐప్లై చేయొచ్చని డాక్టర్ చెబుతున్నారు.



జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం: పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ





**-మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట..**
**-ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం ఉపాధికి ప్రోత్సాహం...**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ఇందిర మహిళా శక్తి" కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు శేరిలింగంపల్లి డివిజన్ కార్యాలయంలో మరియు చందానగర్ లోని అంబేద్కర్ కల్యాణ మండపం లో మియాపూర్ సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు "ఇందిరమ్మ" చీరల పంపిణీ కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్, ప్రాజెక్టు ఆఫీసర్ స్వాతి రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు తో కలిసి మహిళ సోదరిమణులకు చీరలను పంపిణీ చేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మియాపూర్ సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల లో గల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు "ఇందిరమ్మ" చీరల పంపిణీ చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది అని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారిని స్వయం ఉపాధి రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు అనేక సంక్షేమ, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలియచేసారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు తక్కువ వడ్డీ రుణాలు, ఆర్థిక సహాయం, శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారిని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలియచేసారు. చిన్నతరహా కార్మికులు, గృహ కార్మికులు, నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో స్వయం సహాయక సంఘాలలో చేరి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయ వృద్ధికి దోహదపడే విధంగా వివిధ వ్యాపార, సేవా రంగాలలో స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడానికి ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర ఆదాయ వనరులను కల్పించే వ్యాపార కార్యకలాపాల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం జరిగినది అని తెలియచేసారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, మహిళల అభివృద్ధే కుటుంబం, సమాజం, రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని తెలియచేసారు. ఇమహిళ ఆర్థిక స్వాలంబన కోసం ఎల్లమ్మబండ లో త్వరలోనే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది అని, మహిళ అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని తెలియచేసారు., మహిళలు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, స్వశక్తితో ఎదగాలని, ఆర్థిక పరిపుష్టి పొందలాని తెలియచేసారు. మెప్మా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా సాధికారత కోసం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, ఇతర మహిళా స్థాయి అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ తెలంగాణ పర్యటన విజయవంతం చేయాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ)** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ ఈ నెల 28, 29, 30 తేదీలలో తెలంగాణలో నిర్వహించనున్న పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడి పర్యటన ఏర్పాట్లు, కార్యకర్తల భాగస్వామ్యం, స్వాగత కార్యక్రమాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, జూన్ 28న మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్‌లో రంగారెడ్డి జిల్లా నూతన బీజేపీ జిల్లా కార్యాలయాన్ని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పోలింగ్ బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ-2లు, శక్తికేంద్ర ఇన్‌చార్జీలు, మండల అధ్యక్షులు, మోర్చాల పదాధికారులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై స్పందిస్తూ, ఎన్నికల జాబితాలను మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా రూపొందించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ద్వంద్వ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపు ద్వారా ఓటరు జాబితాను ప్రక్షాళన చేయడం దీని ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల్లో అనవసర అపోహలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రక్రియకు రాజకీయ రంగు పులమడం సరైన విధానం కాదని అన్నారు. తెలంగాణలో బీజేపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో జాతీయ అధ్యక్షుడి పర్యటన కీలకంగా మారనుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, జ్ఞానేశ్వర్, వివిధ మండలాల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ తెలంగాణ పర్యటన పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత బలోపేతానికి దోహదపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల జూన్ 24:(జర్నలిస్ట్ డైరీ) :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి,వ్యాపార రంగాలపై యువత ఆసక్తి పెంచుకుని విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలి

**-ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
**-మహాలక్ష్మి టైర్స్ హబ్ ప్రారంభోత్సవం**
**-ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**
**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** కొత్తూరు మండలం తిమ్మాపూర్ చౌరస్తాలో నూతనంగా భరత్ రెడ్డి ఏర్పాటు చేసిన మహాలక్ష్మి టైర్స్ హబ్ స్టోర్ ప్రారంబోత్సవంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థను ప్రారంభించి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. స్వయం ఉపాధి,వ్యాపార రంగాలపై యువత ఆసక్తి పెంచుకుని విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలని వ్యాపార రంగంలో యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి చెందుతూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డోలి రవీందర్,మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్ రెడ్డి,మల్లాపూర్ సర్పంచ్ నర్సిమ రెడ్డి,మల్లాపూర్ తండా సర్పంచ్ మీనాక్షి దశరథ్,మాజీ ఎంపీటీసీలు రాజేందర్ గౌడ్,మాజీ సర్పంచ్ రావినాయక్ గ్రామ కమిటీ అధ్యక్షులు నాగరాజు, మరియు శివకుమార్ గౌడ్,శివా చారి పలువురు వార్డ్ మెంబెర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్ల సాధనకు చలో హైదరాబాద్

**-ఈనెల 25న ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నాను విజయవంతం చేయాలి**
**-పిలుపునిచ్చిన షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు ప్రకాష్ గౌడ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న భారీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేస్తున్నారనే వార్తలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెంటనే స్పందించి స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర కీలకమైందని, వారి అధికారాలను కుదించే చర్యలు సరికాదని పేర్కొన్నారు. అలాగే ఉప సర్పంచ్‌లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉప సర్పంచ్‌లకు తగిన అధికారాలు, బీమా సౌకర్యాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఉప సర్పంచ్‌లు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచ్‌లందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న జరిగే "చలో హైదరాబాద్" కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఉప సర్పంచ్‌లకు విజ్ఞప్తి చేశారు.

## పదవీ విరమణ చేసిన హెచ్ఎం కు ఆత్మీయ వీడ్కోలు




**యాచారం (జూన్ 25)జర్నలిస్ట్ డైరీ.** కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరయ్య పదవీ విరమణ సందర్భంగా బుధవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్, ఉప సర్పంచ్ కాలే అనిత రమేష్ మాట్లాడుతూ, ఈశ్వరయ్య సార్ విద్యా రంగానికి అందించిన సేవలు అభినందనీయమని, విద్యార్థుల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు పోలే శివ, చిక్కుడు పావని, సోమరాజు అరవింద్, గ్రామ కార్యదర్శి మహేష్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ ఎం.డి. రఫీక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈశ్వరయ్య సేవలను స్మరించుకున్నారు.

# నాగారంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ



**నాగారం, జూన్ 24:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మామిళ్ల నారాయణ కాలనీ పార్క్‌లలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందిరమ్మ చీరలను అందుకున్న మహిళలు ప్రభుత్వానికి మరియు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. పేద మరియు మధ్యతరగతి మహిళలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

## ప్రతి ఆడబిడ్డ ముఖంలో చిరునవ్వే కాంగ్రెస్ ప్రభుత్వ విజయానికి నిజమైన నిదర్శనం

**- నెమలి అనిల్ కుమార్**



**నాగారం, జూన్ 24:-(జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత లక్ష్యంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు దంతూరి రాజు గౌడ్, చౌదరిపల్లి పర్వతాలు, కోయగూర బాలరాజ్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీ.జీ. సుదర్శన్, మక్తల బాలరాజ్ గౌడ్, మెరుపుల బాలరాజ్ గౌడ్, కప్పర సాయి గౌడ్, బెల్లం శ్రీను, కోయలకొండ రాజేష్, ఎస్వీ కిట్టు, సురేష్ గౌడ్, టిల్లు ముదిరాజ్, మనోహర్, ఫిరోజ్, నిక్కీ గౌడ్, శైలజ, సోని, నిర్మల రెడ్డి, లావణ్య, ఇష్రత్ బాను, సునీత తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి నూతన మారుతి సుజుకి 'ఏరినా విక్టర్' కారు

**- ప్రాంభోత్సవం చేసిన షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న జయరామ్ మోటార్స్‌లో మారుతి సుజుకి సంస్థ నూతనంగా మార్కెట్‌లోకి తీసుకువచ్చిన ఏరినా విక్టర్ కారును షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన వాహనాన్ని ప్రారంభించిన చైర్మన్ బసవేశ్వర్, ఆటోమొబైల్ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికత వినియోగదారులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందిస్తోందని పేర్కొన్నారు. నాణ్యమైన సేవలు, ఆధునిక ఫీచర్లతో కూడిన వాహనాలు ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), జయరామ్ మోటార్స్ ప్రతినిధులు, కంపెనీ సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. నూతన కారు లాంచింగ్ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులు అతిథులకు స్వాగతం పలికి, వాహనం ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# శాంతి కోసం పోరాటం



ఇరవయ్యొకటవ శతాబ్దం మానవ చరిత్రలో అత్యంత శాస్త్రీయ, సాంకేతిక పురోగతి సాధించిన కాలంగా చెప్పబడుతున్నప్పటికీ, అదే సమయంలో అత్యంత అస్థిరత, అనిశ్చితి, యుద్ధ భయాలతో నిండిన యుగంగా కూడా మారుతోంది. ప్రపంచ దేశాలు ఒకవైపు అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర వృద్ధి గురించి మాట్లాడుతుండగా, మరోవైపు తమ రక్షణ బడ్జెట్లను విపరీతంగా పెంచుకుంటూ ఆయుధాల సమీకరణలో నిమగ్నమవుతున్నాయి. ప్రపంచ శాంతి, సహకారం, పరస్పర అవగాహన కోసం స్థాపించబడిన అంతర్జాతీయ సంస్థలు బలహీనపడుతుండగా, సైనిక శక్తి, ఆర్థిక ఆధిపత్యం, భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కోసం దేశాల మధ్య పోటీ తీవ్ర రూపం దాల్చుతోంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ప్రపంచ శాంతిని కాపాడాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. యుద్ధాలను నివారించడం, వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించడం, పేదరిక నిర్మూలన, మానవ హక్కుల పరిరక్షణ వంటి ఉన్నత ఆదర్శాలను అది ముందుకు తీసుకొచ్చింది. కానీ నేడు ఆ సంస్థ తన లక్ష్యాలకు చాలా దూరంగా వెళ్లినట్లు కనిపిస్తోంది. సభ్య దేశాల నుంచి తగిన ఆర్థిక సహకారం లేకపోవడం, రాజకీయ సంకల్పం లోపించడం, ముఖ్యంగా భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాల వీటో అధికారం వల్ల అనేక కీలక నిర్ణయాలు నిలిచిపోతున్నాయి.

భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలు -- అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ -- ప్రపంచ శాంతికి సంరక్షకులుగా ఉండాల్సి ఉండగా, తరచూ తమ జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. వీటో అధికారం కారణంగా అంతర్జాతీయ న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య సూత్రాలు పక్కన పడుతున్నాయి. ఒక దేశం చేసిన చర్యను మరొక దేశం ఖండించాలనుకున్నా, శాశ్వత సభ్య దేశాల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంటే నిర్ణయాలు అమలుకావడం లేదు. దీంతో ఐక్యరాజ్యసమితి ప్రభావం క్రమంగా తగ్గిపోతోంది. ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు ఈ పరిస్థితిని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. అమెరికా, రష్యా వంటి అగ్రరాజ్యాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా యుద్ధ రంగాల్లో పాల్గొంటున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఘర్షణలు, ఎర్ర సముద్ర ప్రాంత ఉద్రిక్తతలు, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్త సంబంధాలు ప్రపంచ శాంతిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. యుద్ధాలు కేవలం సరిహద్దులకే పరిమితం కావు; వాటి ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ఆహార భద్రతపై, ఇంధన సరఫరాపై, అంతర్జాతీయ వాణిజ్యంపై పడుతుంది.

ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం ప్రపంచానికి కొత్త సవాళ్లను విసురుతోంది. ప్రపంచ చమురు నిల్వలలో గణనీయమైన భాగం ఈ ప్రాంతంలోనే ఉంది. అక్కడ యుద్ధాలు, ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా చమురు ధరలు పెరుగుతాయి. చమురు ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు, విద్యుత్ ఉత్పత్తి వ్యయాలు, పారిశ్రామిక ఉత్పత్తి ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఫలితంగా సాధారణ ప్రజల జీవన వ్యయం మరింత భారంగా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాల కొనుగోళ్లకు ఖర్చు చేస్తున్న నిధులు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. కోట్లాది మంది ప్రజలు ఆకలి, నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు, విద్యా లోపాలతో బాధపడుతున్నప్పటికీ, దేశాలు ట్రిలియన్ల డాలర్లను సైనిక ఖర్చులకు వెచ్చిస్తున్నాయి. ఈ నిధులు మానవ అభివృద్ధికి వినియోగించబడితే పేదరికం, నిరక్షరాస్యత, పోషకాహార లోపం వంటి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చు. కానీ ఆయుధ పరిశ్రమలు, సైనిక కూటములు, భౌగోళిక రాజకీయ పోటీలు ఈ దిశగా మార్పును అడ్డుకుంటున్నాయి.

యుద్ధాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వలసల సమస్య కూడా పెరుగుతోంది. లక్షలాది మంది ప్రజలు తమ నివాసాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. శరణార్థుల సంఖ్య పెరుగుతుండటంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు మరింత సంక్లిష్టమవుతున్నాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఆర్థిక అసమానతలు పెరగడం, యువతలో నిరాశ విస్తరించడం వంటి పరిణామాలు అనేక దేశాల్లో కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని మార్క్సిస్ట్ దృక్పథంలో పరిశీలిస్తే, యుద్ధాలు తరచుగా ఆర్థిక ప్రయోజనాల విస్తరణకు, మార్కెట్లపై ఆధిపత్యానికి, సహజ వనరుల నియంత్రణకు సంబంధించినవిగా కనిపిస్తాయి. సామ్రాజ్యవాద పోటీలు కొత్త రూపాల్లో కొనసాగుతున్నాయి. ఒకప్పుడు కాలనీల ద్వారా జరిగిన ఆధిపత్యం, నేడు ఆర్థిక ఒత్తిళ్లు, సైనిక కూటములు, వాణిజ్య ఆంక్షలు, వ్యూహాత్మక యుద్ధాల రూపంలో వ్యక్తమవుతోంది. అయితే ఈ సంక్షోభాల మధ్య ప్రపంచానికి ప్రత్యామ్నాయ మార్గం కూడా ఉంది. మొదటగా, ఐక్యరాజ్యసమితి సంస్కరణలు అత్యవసరం. భద్రతా మండలి నిర్మాణాన్ని మరింత ప్రజాస్వామ్యబద్ధంగా మార్చాలి. వీటో అధికారంపై పునరాలోచన అవసరం. రెండవది, ఆయుధాల నియంత్రణ ఒప్పందాలను బలోపేతం చేయాలి. మూడవది, ప్రపంచ దేశాలు సైనిక ఖర్చుల్లో కొంత భాగాన్ని ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి సృష్టి వంటి రంగాలకు మళ్లించాలి. అలాగే పునరుత్పాదక ఇంధన వనరులపై పెట్టుబడులు పెంచడం ద్వారా చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థపై ఆధారపడటాన్ని తగ్గించాలి. ప్రాంతీయ సహకార వేదికలను బలోపేతం చేయాలి. వివాదాలను యుద్ధం ద్వారా కాకుండా దౌత్యపరమైన చర్చలు, మధ్యవర్తిత్వం, అంతర్జాతీయ న్యాయ వ్యవస్థల ద్వారా పరిష్కరించే సంస్కృతిని పెంపొందించాలి. మానవజాతి నేడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఒకవైపు ఆయుధాల పోటీ, యుద్ధాలు, ఆధిపత్య రాజకీయాలు ఉన్నాయి; మరోవైపు శాంతి, సహకారం, సుస్థిర అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో దానిపైనే భవిష్యత్ తరాల భద్రత ఆధారపడి ఉంటుంది. యుద్ధం చివరికి విధ్వంసాన్నే మిగులుస్తుంది. శాంతి మాత్రమే అభివృద్ధికి, సమానత్వానికి, మానవ సంక్షేమానికి శాశ్వత పునాది. అందువల్ల ప్రపంచ నాయకులు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజం కలిసి శాంతి, సహకారం, న్యాయం ఆధారిత ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం గతంలో ఎప్పుడూ లేనంతగా నేడు ఉంది.

**- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమీషన్‌ను కలిసిన

**- శివసేన తెలంగాణ మేడ్చల్ ఇంచార్జి సురేష్ కుమార్...**

**నాగారం, జూన్ 24:(జర్నలిస్ట్ డైరీ)** శివసేన తెలంగాణ మేడ్చల్ ఇన్‌చార్జ్ అక్కల సురేష్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయాన్ని సందర్శించి, కమిషన్ అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ప్రస్తుత స్థితిగతులు, వాటి అమలు విధానం, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు మరియు ప్రజలకు అవి ఎంత మేరకు ఉపయోగపడుతున్నాయనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్య,




ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం, సామాజిక భద్రత, హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అక్కల సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం రూపొందించిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రజలకు పథకాలపై మరింత అవగాహన కల్పించడం ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు.

సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ మరియు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం శివసేన నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

**జగిత్యాల జిల్లా (జర్నలిస్ట్ డైరీ) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పకడ్బందీగా, పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత కోరారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ ఇరవై ఐదు నుంచి జూలై ఇరవై నాలుగు వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. జూలై ఇరవై నాలుగున పోలింగ్




కేంద్రాల క్రమబద్ధీకరణ, జూలై ముప్పై ఒకటిన ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై ముప్పై ఒకటి నుంచి ఆగస్టు ముప్పై వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ ఇరవై ఎనిమిది వరకు అభ్యంతరాల పరిష్కారం అనంతరం అక్టోబర్ ఒకటి, రెండువేల ఇరవై ఆరున తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. బీఎల్‌వోలు ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఫారం అందని వారు లేదా జాబితాలో చేరని అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా, అనర్హులు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఓటర్ల మార్పులు, చేర్పుల కోసం ఫారం-ఎనిమిది, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-ఆరు వినియోగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు, మున్సిపల్ కమిషనర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జూలై 5న భువనగిరిలో జరగనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలి-బొలుగుల నరసింహ ఏకలవ్య

**-వలిగొండలో రాజ్యాధికార సమరభేరి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ**
**-ప్రజలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపు**
**-బహుజన వర్గాల స్వరాన్ని బలంగా వినిపించే వేదికగా సమరభేరి నిలుస్తుందన్న నాయకులు**




**వలిగొండ జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో జూలై 5న భువనగిరిలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలని వలిగొండ మండల రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు బొలుగుల నరసింహ ఏకలవ్య పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా బుధవారం వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక న్యాయం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలతో ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.తెలంగాణ రాజకీయాల్లో బహుజన వర్గాల స్వరాన్ని మరింత బలంగా వినిపించే వేదికగా ఈ సమరభేరి నిలుస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గొలుసుల శ్రీనివాస్, కమిటీ సభ్యులు కొండ నరేష్, లాక్య నరసింహ, మానుపాటి లక్ష్మయ్య, భూపతి అశోక్, గుగ్గిళ్ల శేఖర్, రవికుమార్, ఎం.డి. ఆస్కార్ తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో ఇందిరమ్మ చీరలు పంపిణీ



**నాగారం, జూన్ 24:- (జర్నలిస్ట్ డైరీ) :** కీసరలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చేరల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చీరలు అందుకున్న మహిళలు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి మహిళలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తంచేశారు.

# పర్వతాపూర్‌లో ఇందిరమ్మ చీరలు పంపిణీ....



**నాగారం, జూన్ 24:- (జర్నలిస్ట్ డైరీ) :** మేడిపల్లి డివిజన్ పరిధిలోని పర్వతాపూర్ లో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళల అభివృద్ధికి కృషి చేస్తన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గోద్రెజ్ ఆగ్రోవెట్ హిట్‌వీడ్ మ్యాక్స్‌పై ప్రత్యేక ఆఫర్



**హైదరాబాద్, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** పత్తి రైతులు సకాలంలో కలుపు నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రోత్సహించేందుకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ తమ సెలెక్టివ్ హెర్బిసైడ్ 'హిట్‌వీడ్ మ్యాక్స్'పై క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించినట్లు గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ క్రాప్ కేర్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ఉత్పత్తిని కొనుగోలు చేసిన రైతులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం లేదా మిస్డ్ కాల్ ద్వారా ప్రోమో కోడ్ పొందడం ద్వారా హామీతో కూడిన క్యాష్‌బ్యాక్ రివార్డులను నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో పొందవచ్చని తెలిపారు. హిట్‌వీడ్ మ్యాక్స్ పత్తి పంటలో మొలకెత్తిన తర్వాత ఉపయోగించే హెర్బిసైడ్ అని, ఇది గడ్డి, వెడల్పాటి ఆకుల కలుపు మొక్కలను సమర్థవంతంగా నియంత్రిస్తుందని తెలిపారు. కలుపు మొక్కలు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ప్రతి పంపుకు 70 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు.

# చిట్యాలలో కాంగ్రెస్ పార్టీకి నూతన సారథులు





**చిట్యాల జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ)** చిట్యాల మండల పార్టీ అధ్యక్షులుగా జడల చిన్న మల్లయ్య యాదవ్,పట్టణ పార్టీ అధ్యక్షులుగా ఎద్దులపురి కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పున్న కైలాస నేత,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం హాజరై నూతన అధ్యక్షులను అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తూ చిట్యాల మండలంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తానని,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.పట్టణ అధ్యక్షులు ఎద్దులపురి కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పట్టణంలో పార్టీని ప్రతి వార్డులో విస్తరిస్తామని,ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నూతన కమిటీలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్,పోకల దేవదాసు,గుడిపాటి లక్ష్మీ నరసింహ,పాటి నర్సిరెడ్డి,పిషాటి భీష్మారెడ్డి, జనగాం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# మూడు రెట్లకు పైగా వృద్ధి సాధించిన భీమ్ పేమెంట్స్ యాప్

**-ఎన్.సీ.పీ.ఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ ఎండీ లలిత నటరాజ్ వెల్లడి**



**నల్గొండ, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** భీమ్ పేమెంట్స్ యాప్ జూన్ 2025, మే 2026 మధ్య మూడు రెట్లకు పైగా వృద్ధి సాధించినట్లు ఎన్.సీ.పీ.ఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్(ఎన్‌బీఎస్ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ లలిత నటరాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ నెలవారీ లావాదేవీలు 7.964 కోట్ల నుంచి 24.4 కోట్లకు పెరగగా, మే 2026లో రూ.26,952 కోట్ల విలువైన లావాదేవీలు ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. తెలంగాణలో కూడా ఇదే ధోరణి కనిపించిందని ఆమె తెలిపారు. మే 2026లో రాష్ట్రంలో భీమ్ యాప్ ద్వారా జరిగిన మర్చంట్ లావాదేవీల్లో కిరాణా విభాగం 23.9 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, ఫుడ్ అవుట్‌లెట్లు 18.1 శాతం, క్విక్ కామర్స్ 11.6 శాతం వాటా సాధించాయని తెలిపారు. డెయిరీ, బేకరీలు(3.2శాతం), ఇంధన కేంద్రాలు(2.8శాతం), ఈ-కామర్స్ (2.2శాతం), ప్రభుత్వ సేవలు(2.0శాతం) కూడా గణనీయమైన వాటా నమోదు చేశాయని తెలిపారు. అలాగే, యూపీఐ లైట్, రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ వినియోగం పెరుగుతుండటం వినియోగదారులు మరింత సులభమైన, నిరంతరాయమైన డిజిటల్ చెల్లింపు విధానాలను స్వీకరిస్తున్నారనడానికి నిదర్శనమని లలిత నటరాజ్ పేర్కొన్నారు.

# చిట్యాలలో బీఎల్ఏలకు ఎస్ఐఆర్ పై శిక్షణ



**చిట్యాల జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ లో భాగంగా చిట్యాల మండల బూత్ లెవెల్ ఏజెంట్లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. స్థానిక బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏఈఆర్ఓ, తహసీల్దార్ ఎం. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐఎన్‌సీ, సీపీఎం, బీఎస్పీ, బీజేపీ మండల అధ్యక్షులు, ఆయా పార్టీల బీఎల్‌ఏలు హాజరయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులపై బీఎల్‌ఏలకు తహసీల్దార్ దిశానిర్దేశం చేశారు. SIR ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. ఫారం-6, 7, 8లను సక్రమంగా నింపాలని, ఇంటింటి సర్వే ద్వారా కచ్చితమైన సమాచారం సేకరించాలని ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా కీలకమని, బీఎల్‌ఏలు బాధ్యతగా వ్యవహరించాలని విజయ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య,సిపిఎం పార్టీ నాయకులు జిట్టా నగేష్,అవిశెట్టి శంకరయ్య వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు


# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

**యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు -ఎస్ఐ కురుమూర్తి**




**కల్వకుర్తి, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** యువత చెడు దారిని ఎంచుకోవద్దని, మాదకద్రవ్యాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయని కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి సూచించారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడుతూ -- "తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలతో జీవిస్తారు. ఆ ఆశలను అర్యాశలు చేయకుండా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానంలో ఎదగాలి" అని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాలు సరదాల పేరుతో తీసుకోవద్దని, వాటికి బానిసలై జీవితాన్ని సర్వనాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. వ్యసనాల వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయని విద్యార్థులు గమనించాలని సూచించారు.మంచి స్నేహాలు చేయాలని, చెడు అలవాట్లు ఉన్నవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాలు సేవించమని ఒత్తిడి తెస్తే వెంటనే కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు ఫోన్ చేయాలని ఎస్ఐ కురుమూర్తి సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ పట్నాలకు ప్రభుత్వ విప్ హాజరు



**ఎలిగేడు, జూన్ 24 (జర్నలిస్ట్ డైరీ) :** ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.విజయరమణారావుతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి, పెద్ది కుమార్, గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజినెస్


# భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..

**- ఐటీ, బ్యాంకింగ్, రియల్టీ షేర్లలో బలంగా కొనుగోళ్లు**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్యాంకింగ్ , ఫైనాన్షియల్ , రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 790.54 పాయింట్లు లాభపడి 76,991.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 197.55 పాయింట్లు పెరిగి 24,021.65 వద్ద ముగిసింది.ట్రేడింగ్ సెషన్ ఆరంభం నుంచే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కనిపించింది. కీలక రంగాల్లో ఇన్వెస్టర్లు షేర్లను కొనుగోలు చేయడంతో సూచీలు మంచి లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్ షేర్లు అత్యధికంగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ రియల్టీ సూచీలు రెండు శాతానికిపైగా లాభపడి మార్కెట్ ర్యాలీని నడిపించాయి. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా మంచి లాభాలను నమోదుచేశాయి.అయితే నిఫ్టీ ఆటో, నిఫ్టీ మెటల్ సూచీలు నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ కారణంగా ఈ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.10 శాతం, స్మాల్‌క్యాప్ 0.39 శాతం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. టెక్నికల్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి 24,100 స్థాయివద్ద తక్షణ ప్రతిఘటన ఎదురవుతోంది. దీనిని అధిగమిస్తే బుల్లిష్ ట్రెండ్ కొనసాగి 24,200, ఆపై 24,400 స్థాయిలకు చేరే అవకాశం ఉంది. మరోవైపు 24,000 మార్క్ తక్షణ మద్దతుగా, 23,900–23,800 జోన్ కీలక సపోర్ట్‌గా పనిచేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# భీమ్ పేమెంట్స్ మూడింతలు




**హైదరాబాద్,**

ప్రభుత్వరంగ సంస్థ భీమ్ పేమెంట్స్ యాప్ లావాదేవీలు మూడింతలు అయ్యాయి. జూన్ 2025 నుంచి మే 2026 వరకు ఈ యాప్ ద్వారా జరిపే ఆర్థిక లావాదేవీలు మూడింతలు పెరిగినట్టు ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ వెల్లడించింది. గతేడాది జూన్‌లో 79.64 మిలియన్ల లావాదేవీలు జరుగగా..ఈసారి మే చివరినాటికి ఇవి 244 మిలియన్లకు చేరుకున్నాయని ఎన్‌బీఎస్‌ఎల్ ఎండీ, సీఈవో లలితా నటరాజ్ తెలిపారు.మొత్తం లావాదేవీల విలువ రూ.26,952 కోట్లుగా నమోదైందన్నారు. ప్రస్తుతం అందిస్తున్న ఆర్థిక సేవలకుగాను క్రెడిట్ కార్డు, డిజిటల్ రుణాలు, ఇతర రుణాల సేవలను కూడా త్వరలో ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. దేశవ్యాప్తంగా జరిగిన లావాదేవీల్లో తెలంగాణ వాటా 23.9 శాతంగా ఉన్నదన్నారు.

# దేశ వృద్ధిరేటుకు వర్షం దెబ్బ!




**న్యూఢిల్లీ,**

ఈ ఆర్థిక సంవత్సరం (2026–27) భారత జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతానికే పరిమితం కావచ్చని ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2025–26) 7.7 శాతంగా నమోదైన నేపథ్యంలో ఇంధన ధరలు, వర్షాభావ పరిస్థితులు.. దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని తాజాగా విడుదల చేసిన ఓ నివేదికలో చెప్పింది.ఆర్బీఐ ద్రవ్య సమీక్షలోనూ ఈసారి దేశ జీడీపీ 6.6 శాతానికే పరిమితం కావచ్చని పేర్కొన్న సంగతి విదితమే. ఇందుకు తగ్గట్టే ఎస్‌అండ్‌పీ గ్లోబల్ అంచనాలూ ఉండటం గమనార్హం. కాగా, వినియోగదారుల ద్రవ్యోల్బణం పెరిగే వీలుందని, అధిక ఇంధన ధరలతో తయారీదారులు ఉత్పాదక వ్యయాన్ని కస్టమర్లపై మోపుతుండటమే కారణమన్నది.

# సత్తాచాటుతున్న తెలంగాణ కంపెనీలు..

**- గత ఐదేండ్లలో రోజుకు రూ.283 కోట్లు పెరిగిన సంపద**

**-2025 బర్గండీ ప్రైవేట్ హురున్ ఇండియా-500లో వెల్లడి**




**హైదరాబాద్,**

రాష్ట్రానికి చెందిన పలు కార్పొరేట్ సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నాయి. తాజాగా యాక్సిస్ బ్యాంక్‌నకు చెందిన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా విడుదల చేసిన 2025 బర్గుండీ ప్రైవేట్ హురున్ ఇండియా 500 జాబితాలో తెలంగాణ నుంచి 39 సంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఈ జాబితా విడుదలైనప్పటీ నుంచి ఇప్పటి వరకు మరో తొమ్మిది సంస్థలు చోటు దక్కించుకోవడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ దిగ్గజాల నికర విలువ రూ.12.1 లక్షల కోట్లుగా నమోదైంది. 2021లో నమోదైన రూ.5.2 లక్షల కోట్ల కంపెనీల విలువతో పోలిస్తే ఇది 75 శాతం అధికమని పేర్కొంది.అలాగే ఈ జాబితాలో దేశీయ ఫార్మా దిగ్గజాల్లో ఒకటైన దివీస్ ల్యాబ్ రాష్ట్ర జాబితాలో తొలిస్థానంలో నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.7 లక్షల కోట్లు. అలాగే ఆ తర్వాత స్థానాల్లో డాక్టర్ రెడ్డీస్ రూ.1.1 లక్షల కోట్లు, మేఘా ఇంజినీరింగ్ రూ.83,800 కోట్లతో నిలిచాయి. గత ఐదేండ్లలో హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న కంపెనీలు ప్రతిరోజూ దాదాపు రూ.283 కోట్ల సంపదను పోగేశాయి. ప్రభుత్వరంగ సంస్థలు, అనుబంధ సంస్థలను మినహాయించి ఈ జాబితాను రూపొందించింది. ఏప్రిల్ 30, 2026 నాటికి రూ.10,230 కోట్లు(1.1 బిలియన్ డాలర్లు) కంటే అధిక విలువ కలిగి సంస్థలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం అధికం.

# ఇంగ్లండ్‌లో వైభవ్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్

## స్పోర్ట్స్




లండన్

ఐపీఎల్‌లో పవర్‌ఫుల్ బ్యాటింగ్‌తో దంచికొట్టి భారత జట్టులో చోటు దక్కించుకున్న 15 ఏండ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లండ్ టూర్‌లో స్పెషల్ ట్రీట్‌మెంట్ లభించనుంది. ఇంగ్లండ్‌తో వచ్చే నెలలో జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు సెలెక్ట్ అయిన వైభవ్ తోడుగా అతడి తల్లిదండ్రులను బీసీసీఐ వెంట పంపిస్తుండగా.. అన్ని వేదికల్లోనూ ఆ కుర్రాడికి ప్రత్యేక చేంజింగ్ రూమ్ కేటాయించనున్నారు.ఐసీసీ, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నిబంధనల ప్రకారం 16 ఏండ్ల లోపు ఆటగాళ్లను పెద్దల చేంజింగ్ రూమ్స్‌లోకి అనుమతించని కారణంగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యాచ్ సమయంలో అతడు టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లోనే ఉంటూనే టీమ్ మీటింగ్స్‌లో పాల్గొనే అవకాశం ఉన్నప్పటికీ, దుస్తులు మార్చుకునేటప్పుడు మాత్రం ప్రత్యేక రూమ్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది.

# ఇన్‌స్టాలో పంత్ ఆసక్తికర పోస్ట్..!




ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి అధికారికంగా స్వాప్ అయిన తర్వాత రిషభ్ పంత్ సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ పెట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ తనకు వీడ్కోలు పలుకుతూ పెట్టిన పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'థాంక్యూ టీమ్' అని రాసుకొచ్చాడు. రూ. 27 కోట్ల రికార్డు ధరతో లక్నోలో చేరిన పంత్.. కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలం కావడంతో జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగుకు పడిపోయింది. ఈ క్రమంలోనే కుల్‌దీప్ యాదవ్‌తో ట్రేడ్ ద్వారా పంత్ రూ. 12 కోట్ల జీతాన్ని తగ్గించుకుని మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఐపీఎల్‌లో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డు క్రియేట్ చేసిన రిషభ్ పంత్.. రెండేళ్ల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్‌ను వీడాడు. ఐపీఎల్ 2025 వేలంలో లక్నో.. రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్లకు దక్కించుకుంది. కెప్టెన్‌ను చేసింది. అయితే ఆటగాడిగా, కెప్టెన్‌గా దారుణంగా విఫలమయ్యాడు. దీంతో లక్నో సూపర్ జెయింట్స్.. పంత్‌ను వదిలేసింది. స్వాప్ డీల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి కుల్‌దీప్ యాదవ్‌ను తెచ్చుకుని.. రిషభ్‌ను ఇచ్చేసింది. అయితే ఇది జరిగిన తర్వాత ఈ వికెట్ కీపర్ ఆసక్తికర పోస్టు పెట్టాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌తో ట్రేడ్ తర్వాత.. అతడు సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. లక్నో సూపర్ జెయింట్స్ వీడ్కోలు పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'థాంక్యూ టీమ్' అని రాసుకొచ్చాడు. దీంతో పంత్‌కు, లక్నో సూపర్ జెయింట్స్‌కు మధ్య బంధం తెరపడినట్లయింది. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు లక్నోలో చేరిన అతడు.. ఐపీఎల్ 2026 పూర్తయిన కొన్ని రోజులకే ఆ ఫ్రాంఛైజీని వీడాడు. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున పంత్.. ఆశించిన మేర రాణించలేకపోయాడు. ఎన్నో అంచనాలతో కొత్త ఫ్రాంఛైజీలో చేరిన అతడు.. అంచనాలను అందుకోలేదు. ఐపీఎల్ 2025లో లక్నో.. ఆరు విజయాలు, ఎనిమిది ఓటములతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. తర్వాతి సీజన్ మరింత కష్టంగా మారింది. పంత్ నాయకత్వంలోని జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగు విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానానికి పరిమితమైంది. ఐపీఎల్ 2025లో పంత్ 14 మ్యాచ్‌లలో 269 పరుగులు చేశాడు. ఐపీఎల్ 2026లో 312 పరుగులు చేశాడు. ఇందులో ఒకే అర్ధశతకం ఉంది. ఇక తాజా ట్రేడ్ ద్వారా పంత్ జీతంలో భారీ కోత పడింది. అతడు తన ఐపీఎల్ జీతంలో ఏకంగా రూ. 12 కోట్లు తగ్గించుకున్నాడు. రూ. 15 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరిపోయాడు. 2016 నుంచి 2024 మధ్య ఎనిమిది సీజన్ల పాటు తాను ఆడిన ఫ్రాంచైజీతో అతడు మళ్లీ జతకట్టాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వెళ్లే ముందు పంత్ ఢిల్లీ తరపున 111 మ్యాచ్‌లు ఆడాడు. అలాగే 2021 నుంచి 2024 వరకు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, 43 మ్యాచ్‌లలో జట్టును నడిపించాడు.

# భారీ విజయమే లక్ష్యంగా..

**నేడు బంగ్లాతో తలపడనున్న భారత్**

**రాత్రి 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో**




మాంచెస్టర్

రెండు భారీ విజయాలతో టీ20 ప్రపంచకప్ వేటను ఆరంభించిన భారత మహిళల క్రికెట్ జట్టు.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగే గ్రూప్–ఏలో భాగంగా బంగ్లాదేశ్‌తో తలపడనుంది. నాలుగు రోజుల క్రితం దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన టీమ్ఇండియా.. మళ్లీ గెలుపుబాట పట్టడంతో పాటు నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థిపై భారీ తేడాతో గెలువాలనే లక్ష్యంతో ఉంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. నాలుగు పాయింట్లతో ఆస్ట్రేలియా (8 పాయింట్లు) తర్వాత రెండో స్థానాన ఉన్నా సఫారీ, బంగ్లా జట్లు సైతం అన్నే పాయింట్లతో భారత్‌కు పోటీనిస్తున్నాయి. అయితే నెట్ రన్‌రేట్ విషయంలో భారత్ (o2.511).. సౌతాఫ్రికా (–0.546), బంగ్లా (–0.641) కంటే మెరుగ్గా ఉండటం సానుకూలాంశం. బంగ్లాతో పాటు లీగ్ దశలో ఆఖరున ఆసీస్‌తో ఆడే మ్యాచ్‌లోనూ గెలిస్తే మిగతా సమీకరణాలతో సంబంధం లేకుండా భారత్ సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. కానీ ఒక్కదాంట్లో ఫలితం తేడా కొట్టినా జట్టుకు కష్టాలు తప్పవు. ఈ నేపథ్యంలో బంగ్లాపై భారీ తేడాతో గెలువడం హర్మన్‌ప్రీత్ అండ్ కో.కు అత్యంత కీలకం.

# శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.






## అదరగొట్టే అందాలతో ఆషిక రంగనాథ్..

# రూ.100 కోట్లతో రాపో23..

### -రామ్ పోతినేని పాన్ ఇండియా ప్లాన్, టాప్ టీమ్ ఫిక్స్!




యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా RAPO23 చిత్రం తెరకెక్కబోతున్నట్లు సమాచారం. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ పోతినేని ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా నిర్మిస్తున్నారు. రామ్ ఇమేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా ఈ ప్రాజెక్ట్‌ను అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ స్కేల్‌లో ప్లాన్ చేశారు. ఇప్పటివరకు రామ్ కెరీర్‌లో చేయని విధంగా యాక్షన్, ఎమోషన్, గ్రాండియర్ కలబోసిన కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది.ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం కోసం ఏకంగా రూ.100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలుస్తుంది. దీంతో టాలీవుడ్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాల్లో ఒకటిగా RAPO23 నిలవనుంది. బడ్జెట్‌కే తగ్గట్టుగా ఈ సినిమా కోసం ఇండియన్ సినిమాలోని టాప్ టెక్నీషియన్స్‌ను రంగంలోకి దించబోతున్నారు. నేషనల్ అవార్డు గ్రహీత, స్టార్ సినిమాటోగ్రాఫర్ తిరు ఈ చిత్రానికి విజువల్స్ అందిస్తుండగా, హాలీవుడ్ రేంజ్ యాక్షన్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన పీటర్ హెయిన్ హై వోల్టేజ్ ఫైట్ సీక్వెన్స్‌లను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే పీటర్ హెయిన్ టీమ్‌తో భారీ యాక్షన్ బ్లాక్స్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయి. ఇక ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శివార్లలో భారీ సెట్స్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒక సిటీ సెట్‌తో పాటు కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్ కోసం స్పెషల్ సెట్స్ వేస్తున్నారు. కళ్లు చెదిరే యాక్షన్ ఎపిసోడ్స్, రిచ్ ప్రొడక్షన్ డిజైన్, వరల్డ్ క్లాస్ టెక్నీషియన్స్ కలయికలో వస్తున్న =ూాూ23 రామ్ పోతినేని కెరీర్‌లో గేమ్ ఛేంజర్ అవుతుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటులు, హీరోయిన్, మ్యూజిక్ డైరెక్టర్ వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉండగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది.

# 'గాసిప్' సినిమా చూడాల్సిందే




మనం సరదాగా మాట్లాడే మాటలు ఇతరుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియాలంటే మా 'గాసిప్' సినిమా చూడాల్సిందే' అంటున్నారు దర్శకుడు వైభవ్ కౌండిన్య. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ ప్రధాన పాత్ర పోషించగా.. యతి రేమెళ్ల నిర్మించారు. రవివర్మ, మహేశ్ యడ్లపల్లి, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయికిరణ్ అడివి ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ.. 'మాటకు చాలా శక్తి ఉంది. ఒక మాట మనిషిని నిలబెట్టగలదు. అదే మాట అతడిని కూల్చగలదు. అందుకే ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యత ఉండాలని సందేశాన్నిచ్చే చిత్రమిది. నా జీవితంలో.. నా మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని నిజ సంఘటనలు దీంట్లో ఉన్నాయి. ఇదొక మంచి భావోద్వేగభరిత ప్రయాణం. కచ్చితంగా అందర్నీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. 'ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఒక చిన్న గాసిప్ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తలకిందులు చేస్తుందో చూపించే కథ. దీన్ని థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు నటి రాశీ సింగ్.



# బాలీవుడ్‌లో ఆ స్వేచ్ఛ ఉంటుంది..

### -సౌత్ సినిమాల్లో అలా ఉండదు..
### -షాకింగ్ కామెంట్స్ చేసిన మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది ఈ అందాల తార. ఈ ముద్దుగుమ్మ తన అందంతో, నటనతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది మిల్కీ బ్యూటీ. తెలుగులో వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. మనదగ్గర దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. హీరోయిన్ గా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసి మెప్పించింది. సినిమాలతో పాటు స్పెషల్ సాంగ్స్ కూడా చేసి ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. ఈ చిన్నది ఎక్కువుగా హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది. తెలుగులో చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో నటించింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. అలాగే ఓదెల 2 సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఇదిలా ఉంటే తాజాగా తమన్నా సౌత్ ఇండస్ట్రీ పై చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. బాలీవుడ్ లో ఏదికావాలో అది ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుందని.. కానీ సౌత్ లో అలా ఉండదని చెప్పుకొచ్చింది. బాలీవుడ్‌లో మాత్రం నటన లేదా గ్లామర్ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంటుంది. కానీ సౌత్‌లో ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయాల్సి వస్తుందని తమన్నా చెప్పుకొచ్చింది.ఇప్పుడు ఈ కామెంట్స్ తగ వైరల్ అవుతున్నాయి. మిల్కీ బ్యూటీ కామెంట్స్ పై నెటిజన్స్ రకరకాలుగా స్పందిస్తున్నారు. నిజానికి తమన్నాకు క్రేజ్ అలాగే గుర్తింపు వచ్చింది సౌత్ ఇండస్ట్రీలోనే ముఖ్యంగా తెలుగు సినిమాల్లో.. అలాగే తమిళ్ లోనూ స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు దక్కించుకుంది. సౌత్ సినిమాలతోనే క్రేజ్, ఫ్యాన్ బేస్, స్టార్ డమ్ తో పాటు రెమ్యునరేషన్ కూడా భారీగానే అందుకుంది. కానీ ఇప్పుడు బాలీవుడ్ కు వెళ్లి సౌత్ పై ఇలాంటి కామెంట్స్ చేయడం పై నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465